ట్రిపుల్ ఐటీ సీట్లకు 48,988 దరఖాస్తులు

ఎచ్చెర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు సంబంధించి 4,400 సీట్లకుగానూ 48,988 దరఖాస్తులు వచ్చాయని శ్రీకాకుళంక్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. బుధవారం ఆయన చాంబర్‌లో మాట్లాడుతూ.. 'శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీలో క్యాంపస్‌ల్లో పీయూసీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఈ నెల 20తో దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన వచ్చే నెల 5న జాబితాలను ఆర్జీయూకేటీ అధికారులు విడుదల చేస్తారు. గతేడాది కంటే సుమారు రెండు వేల దరఖాస్తులు ఎక్కువ వచ్చాయ'ని తెలిపారు.

ఆయన జీవితమే.. ఉద్యమం



చదువుకున్న రోజుల్లో నంబాల కేశవరావు

- జిల్లా కమిటీ నుంచి కేంద్ర కమిటీ కార్యదర్శిగా ఎదిగిన నంబాల కేశవరావు
- మావోయిస్టు పార్టీలో గంగన్న, బసవరాజుగా పిలుపు
- ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్
- స్వగ్రామం జీయన్నపేటలో విషాదఛాయలు

టెక్కలి, మే 21(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్‌యూ భావజాలాలకు ఇష్టపడి.. ఆ తరువాత సీపీఐఎంఎల్‌లో చేరి.. మావోయిస్టు పార్టీలో కమాండర్ ఇన్ ఛీఫ్‌గా ఎదిగిన నంబాల కేశవరావు(71) అలియాస్ గంగన్న, బసవరాజు సుమారు ఐదు దశాబ్దాలు ఉద్యమాలకే అంకితమయ్యారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు రథసారధి కేశవరావు ఎన్‌కౌంటర్‌లో మృతి చెందడంతో కోటబొమ్మాళి మండలంలో ఆయన స్వగ్రామమైన జీయన్నపేట మూగబోయింది. సిక్కోలులో పుట్టిన ఆయన.. మావోయిస్టు ఉద్యమనేతగా ఎదిగారు. నౌపడా ఆర్ఎస్ ఎట్ తలగాం హైస్కూల్‌లో ఎనిమిది, తొమ్మిది, పది తరగతులు చదివారు. టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశారు. అనంతరం ఇంజనీరింగ్ కోసం వరంగల్‌లోని ఆర్ఈసీలో చేరారు. ఎంటెక్ కూడా కొంతకాలం అక్కడే చదువుకున్నారు. అదేసమయంలో 1980లో అక్కడ మెస్‌లో జరిగిన ఓ గొడవలో ఒకరు చనిపోయారు. కేశవరావు అప్పటికే ఆర్ఎస్‌యూ భావజాలాలను అందుకున్నారు.

ఎంటెక్ చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పి.. నక్సల్‌బరి ఉద్యమంలో చేరారు. అదే ఏడాది జీయన్నపేటలో తన మిరప పొలానికి నూతిలోని నీరు తోడుతుండగా.. మెస్‌లో జరిగిన హత్య కేసుకు సంబంధించి పోలీసులు రాగా, సమీప కొండల్లోకి కేశవరావు పారిపోయారు. కొద్దిరోజుల తర్వాత చింతపల్లి అడవుల్లో పోలీసులకు చిక్కగా ఆయనను విశాఖ సెంట్రల్‌జైల్‌కు తరలించారు. ఆ సమయంలో కామ్రేడ్ చౌదరి తేజేశ్వరరావుతో కలిసి ఆయన జైల్‌లో గడిపాడు. ఓ న్యాయవాది సహాయంతో బెయిల్‌పై బయటకు వచ్చిన కేశవరావు.. ఆ తరువాత నుంచి ఇంటి ముఖం చూడలేదు. సాయుధ పోరాటమే ఊపిరిగా సుమారు 45 ఏళ్ల అజ్ఞాత జీవనాన్ని గడిపారు.

రూ.1.50 కోట్ల రివార్డు

కేశవరావు.. అలియాస్ గంగన్నగా, రాష్ట్ర కమిటీ సభ్యుడైన తరువాత బసవరాజుగా మావోయిస్టు పార్టీలో పిలవబడి ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించాడు. మొదటిగా సీపీఐఎంఎల్‌లో తూర్పుగోదావరి జిల్లా సభ్యుడిగా, రాష్ట్రకమిటీ సభ్యుడిగా, ఆ తరువాత మావోయిస్టు పార్టీలో కేంద్రకమిటీ సభ్యుడిగా ఎదిగాడు. 2018లో అప్పటి మావోయిస్టు కేంద్ర ప్రధానకార్యదర్శి లక్ష్మణరావు అనారోగ్యంతో రాజీనామా చేశారు. అనంతరం మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా కేశవరావు బాధ్యతలు స్వీకరించారు. కేశవరావు కొన్నాళ్ల ఎల్‌టీటీఈలో కూడా శిక్షణ పొందాడు. గెరిల్లా, మిలటరీ సాంకేతిక వ్యూహాల్లో దిట్ట. అనేక దాడుల్లో పాలుపంచుకున్నారు. అందుకే కేశవరావు తలకు మొదట రూ.10 లక్షలతో రివార్డు ప్రారంభమై.. చివరికి కోటిన్నర రూపాయల వరకు చేరింది.

ఉపాధ్యాయ కుటుంబంలో పుట్టి..

జీయన్నపేటకు చెందిన వాసుదేవరావు, భారతమ్మ దంపతులకు 1955లో కేశవరావు జన్మించారు. తండ్రి వాసుదేవరావు ఉపాధ్యాయుడు. తల్లి భారతమ్మ గృహిణి. ఈయనకు ఇద్దరు సోదరులు, ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఉన్నారు. పెద్దన్నయ్య ఢిల్లేశ్వరరావు, తమ్ముడు రాంప్రసాద్ విశాఖలో ఉంటున్నారు. ఒక సోదరి (మిగతా 6వ పేజీలో..)

జీయన్నపేటలోని కేశవరావు ఇల్లు

మొదలైంది గురూ..



- ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ ప్రారంభం
- ముందుగా గ్రేడ్-2 హెచ్‌ఎంలకు స్థానచలనం
- ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్‌కు ఆమోదం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు షెడ్యూల్ విడుదల

నరసన్నపేట, మే 21(ఆంధ్రజ్యోతి)

ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమైంది. బుధవారం నుంచి వచ్చేనెల 11 వరకు ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ముందుగా గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల బదిలీల పక్రియ చేపట్టి.. అనంతరం స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతి కల్పిస్తారు. తర్వాత స్కూల్ అసిస్టెంట్‌లకు బదిలీలు నిర్వహిస్తారు. ఎస్జీటీలకు ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్‌లు)గా పదోన్నతి కల్పించి.. ఎస్జీటీలకు బదిలీల పక్రియ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు 2017 మాదిరి.. ఎస్జీటీలకు మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నారు. ఇదంతా పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పూర్తి చేయనున్నారు. అలాగే జిల్లాలో ఈఏడాది కొత్తగా ఏర్పాటు చేయనున్న మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో పూర్తి స్థాయిలో సిబ్బంది నియమించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు.

జిల్లాలో 3 వేల మందికి..

- ఉమ్మడి జిల్లాలో సుమారు 10,850 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారు 1200 మంది వరకు ఉన్నారు. పాఠశాలలు పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మరో 1800 వరకు.. మొత్తం సుమారు 3వేల మంది ఉపాధ్యాయులకు తప్పనిసరిగా బదిలీ కానుంది. ఈ ఏడాది రెండేళ్ల సర్వీసు చేసిన వారికి బదిలీకి అవకాశం ఇచ్చారు. అలాగే ఉపాధ్యాయులకు ప్రాధాన్యత, బదిలీలలో మార్గదర్శకాలను జారీ చేశారు.
- ఈ నెల 30న స్కూల్ అసిస్టెంట్ల నుంచి హెచ్‌ఎంలకు, జూన్ 5న ఎస్జీటీల నుంచి స్కూల్ (మిగతా 6వ పేజీలో..)

45 గ్రేడ్-2 హెచ్‌ఎంల పోస్టులు ఖాళీ..

జిల్లాలో 45 గ్రేడ్ -2 హెచ్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వివిధ యూపీ పాఠశాలలు, ఉన్నత పాఠశాలలు, అలాగే పదవీవిరమణ కారణంగా జిల్లాపరిషత్ పరిధిలో 43 పోస్టులు, మున్సిపాలటీ ప్రాంతాల్లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని స్కూల్ అసిస్టెంట్‌లకు పదోన్నతి ద్వారా భర్తీ చేయనున్నారు.

- బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులకు తొలిరోజు సాంకేతిక చిక్కులు ఎదురయ్యాయి. బదిలీ చేసుకునే సమయంలో సర్వీసులో చేరిన తేదీ వద్ద.. ఎస్జీటీలో చేరిన తేదీ కాకుండా ఏస్ఏ లో చేరిన తేది మాత్రమే చూపిస్తోంది. దీంతో సర్వీసు పాయింట్లు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

షెడ్యూల్ ఇదే..

	హెచ్‌ఎంలు	ఎస్ఏ	ఎస్జీటీలు
బదిలీల దరఖాస్తుకు	మే 21 నుంచి 22వరకు	21 నుంచి 24వరకు	21 నుంచి 27 వరకు
దరఖాస్తుల పరిశీలన	21 నుంచి 22 వరకు	21 నుంచి 25వరకు	21 నుంచి 28వరకు
ప్రొవిజనల్ సినియార్టీ జాబితా	మే 24న	26 నుంచి 27వరకు	మే 31న
జాబితాపై ఫిర్యాదుల స్వీకరణ	మే 25న	మే 28న	మే 28నుంచి జూన్ 1 వరకు
ఫిర్యాదులపై పరిష్కారం	మే 26న	మే 28నుంచి 29వరకు	మే 28 నుంచి జూన్ 2 వరకు
ఫైనల్ సీనియార్టీ జాబితా	మే 27న	మే 31న	జూన్ 6న
వెబ్‌ఆప్షన్ నమోదు	మే 28న	జూన్ 1,2 తేదీల్లో	జూన్ 7నుంచి 10 వరకు (మాన్యువల్‌గా కౌన్సిలింగ్)
బదిలీల ఆర్డర్లు జారీ	మే 30న	జూన్ 4న	జూన్ 11న



టెక్కలిలో 'మాటామంతీ' కార్యక్రమానికి సిద్ధం చేసిన థియేటర్

'మాటామంతీ'కి సన్నద్ధం

- నేడు రావివలస గ్రామస్థులతో మాట్లాడనున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 'స్ర్కీన్ గ్రీవెన్స్' ద్వారా ప్రక్రియ
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- టెక్కలిలోని భవానీ థియేటర్‌లో ట్రయల్‌రన్

టెక్కలి, మే 21(ఆంధ్రజ్యోతి): టెంపుల్ టూరిజం, గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 'మన ఊరి కోసం మాటామంతీ' అనే స్ర్కీన్ గ్రీవెన్స్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి మంత్రి అచ్చెన్న కృషితో టెక్కలి మండలంలో ప్రసిద్ధ శైవక్షేత్రం.. ఎండలమల్లన్న కొలువైన రావివలస గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ మేరకు గురువారం వెండి తెర వేదికగా వర్చువల్ విధానంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రావివలస గ్రామస్థులతో మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి టెక్కలిలో భవానీ థియేటర్‌ను సిద్ధం చేశారు. 290మంది కూర్చొనేలా ఏర్పాట్లు చేశారు. ఈ ప్రోగ్రామ్ పర్యవేక్షణకు అమరావతి నుంచి ఓ ఐఎఫ్ఎస్ అధికారిని నియమించారు. బుధవారం రావివలసలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అలాగే జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, సీఈవో సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీపీవో కె.భారతి సౌజన్య, ఎడిషినల్ ఎస్పీ(క్రైమ్స్) శ్రీనివాసరావు, వివిధ శాఖల (మిగతా 6వ పేజీలో..)



రావివలస గ్రామం

హైవే ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించండి

- పకడ్బందీగా పెట్రోలింగ్ విధులు
- ఎస్పీ మహేశ్వరరెడ్డి

7లో

అరకొర సదుపాయాలు

- ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులు
- ఇదీ గోపివల్లభపురం 'ఆఫ్‌షోర్' నిర్వాసిత కాలనీ దుస్థితి

8లో

వేసవిలో చల్లగా..

- పెరుగుతున్న ఎండలు
- శీతల పానీయాలకు డిమాండ్

6లో



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

40 ఏళ్లు టీడీపీదే అధికారం

- కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస, మే 21(ఆంధ్రజ్యోతి): కార్యకర్తల మనోధైర్యంతో రాష్ట్రంలో టీడీపీ మరో 40ఏళ్లు అధికారం దిశగా పయనిస్తుందని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం ఆమదాలవలసలోని ప్రైవేటు కళ్యాణ మండపంలో మినీ మహానాడు కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి కేంద్రమంత్రితోపాటు స్థానిక ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'జిల్లా అభివృద్ధికి కృషి చేస్తాం. నాగావళి, వంశధార నదుల నుంచి కాలువల ద్వారా సాగునీటిని పుష్కలంగా అందించేలా చర్యలు చేపడుతున్నాం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. జిల్లాలో పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామ'ని తెలిపారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యమని స్పష్టం చేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటే తాటతీస్తా: ఎమ్మెల్యే రవికుమార్

'ఆమదాలవలసలో అభివృద్ధిని అడ్డుకునేందుకు కొంతమంది కుతంత్రాలు చేస్తున్నారు. అటువంటి వారి తాట (మిగతా 6వ పేజీలో..)



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్ తదితరులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఆదిత్యాలయంలో యోగాంధ్ర ప్రారంభం
- జూన్ 21వరకు నిర్వహణ
- గ్రామస్థాయి నుంచి పెద్ద ఎత్తున పాల్గొనాలి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అరసవల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): 'శారీరక, మానసిక ఆరోగ్యం.. యోగాతోనే సాధ్యం. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతీ దినం యోగా సాధన చేయాల'ని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం అరసవల్లిలోని ఆదిత్యాలయంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి.. 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగా గురువుల ఆధ్వర్యంలో వందలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని సూర్యనమస్కారాలు, ధ్యానం, యోగాసనాలు వేశారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 21వరకు నెలరోజులపాటు 'యోగాంధ్ర' నిర్వహించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. మునిసిపాలిటీల్లో, మండలస్థాయిలో, గ్రామీణ ప్రాంతాల్లో, సచివాలయ స్థాయిలో, అన్ని చోట్లా యోగా శిక్షణను ప్రారంభించాలన్నారు. జూన్ 21వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా లక్షలాదిగా ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొనేలా చేయాలన్నారు. క్విట్ ఇండియా, క్విట్ ఆంధ్రా ఉద్యమంలా యోగాను ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. మొదటివారం జిల్లా స్థాయిలో, రెండవ వారం మండల స్థాయిలో, మూడవ వారం గ్రామస్థాయిలో యోగాసనాల పోటీలు (మిగతా 6వ పేజీలో..)

వేసవిలో చల్లగా



చెరుకు రసం తయారు చేసే యంత్రం



● రాజమండ్రికి చెందిన శీతలపానీయం తయారు చేసే వ్యాపారి ఏటా వేసవి 3 నెలలు మెళియాపుట్టిలో ఉంటూ వ్యాపారం చేస్తున్నాడు. మూడు నెలలు కష్టపడితే ఏడాది పాటు సంతోషంగా బతకవచ్చునని చెబుతున్నాడు. దీన్ని బట్టి చూస్తే వేసవిలో శీతల పానీయాలకు ఉండే డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు.

● రణస్థలానికి చెందిన ఒక వ్యాపారి ఏటా చాపరలో ఇల్లు అద్దెకు తీసుకొని వేసవి మూడు నెలల పాటు కర్బుజాల వ్యాపారం చేస్తుంటాడు. మూడు నెలలు వ్యాపారం చేస్తే చాలు... కుటుంబం అంతా ఏడాది పాటు హాయిగా బతకవచ్చునని చెబుతున్నాడు.

● పెరుగుతున్న ఎండలు
● శీతల పానీయాలకు డిమాండ్
● రోడ్ల పక్కనే వ్యాపారం

మెళియాపుట్టి, మే 21(ఆంధ్రజ్యోతి): ఎండలు బెంబేలెత్తిస్తున్నాయి. వారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు భారీగా పెరుగుతున్నాయి. వేసవి తాపంతో జనం అల్లాడిపోతున్నారు. వేడిమి నుంచి ఉపశమనానికి శీతల పానీయాలు తాగడానికి ప్రజలు ఇష్టపడుతున్నారు. దీంతో ఏ రోడ్డు పక్కన చూసినా శీతల పానీయాలు, కొబ్బరిబోండాలు, తాటిముంజెల విక్రయదారులు కనిపిస్తున్నారు. వీటితో మరోముఖ్యమైనది ఉంది. అదే కర్బూజా. వేసవిలో దీనికి ఉండే డిమాండ్‌ను చెప్పక్కరలేదు.

జిల్లాలో ఇచ్ఛాపురం నుంచి రణస్థలం వరకు ఉన్న జాతీయ రహదారికి ఇరువైపులా కొబ్బరిబోండాలు, తాటిముంజెల అమ్మకాలు జరుగుతున్నాయి. మడపాం, పలాస టోల్‌గేట్ల వద్ద కొంతమంది బండ్లు ఏర్పాటు చేసుకొని ప్రత్యేకంగా శీతల పానీయాలు విక్రయిస్తున్నారు.



చెరుకు రసానికి భలే డిమాండ్..

కొంతమంది యంత్రాలను కొనుగోలు చేసి... వాటిలో చెరుకు రసం తయారుచేసి... అమ్మకాలు సాగిస్తున్నారు. ఒక్కొక్క గ్లాస్ రూ.20 వంతున విక్రయిస్తున్నారు. ఎండా కాలంలో దీనికి డిమాండ్ కూడా అదే స్థాయిలో ఉంటోంది.

కర్బూజా ఖరీదు..

వేసవిలో కర్బూజాకు మంచి డిమాండ్ ఉంటోంది. కిలో రూ.30 నుంచి రూ.35 వంతున విక్రయిస్తున్నారు. ఎక్కువగా రాజమండ్రి ప్రాంతం నుంచి కాయలు తీసుకువచ్చి ఇక్కడ అమ్మకాలు సాగిస్తున్నారు. జిల్లాలో కొత్తూరు, హిరమండలం, పాతపట్నం నదీ పరీవాహక ప్రాంతాల్లో గల భూముల్లో కర్బూజాను సాగుచేస్తున్నారు. ఈ మండలాల నుంచి కూడా జిల్లాలోని వివిధ ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు.


పండ్ల రసాలు అమ్ముతున్న దృశ్యం

పండ్ల రసాలదే అగ్రభాగం..

ఏ కాలంలోనైనా పండ్ల రసాలకు ఉండే ప్రత్యేకత వేరు. సీజన్‌తో సంబంధం లేకుండా వీటికి డిమాండ్ ఉంటుంది. వేసవిలో వీటికి మరి కాస్త ఎక్కువ డిమాండ్ ఉంటుంది. నగరాలే కాదు... చిన్న చిన్న పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ప్రత్యేకంగా ఈ షాపులు ఉంటాయి. వేసవిలో కొంతమంది ప్రత్యేకంగా ట్రాలీ రిక్షాలు ఏర్పాటు చేసుకొని పండ్ల రసాలు తయారు చేసి అమ్మకాలు చేస్తున్నారు. అరటి, ద్రాక్ష, బొప్పాయి, సపోటా తదితర పండ్ల రసాలను వీరు విక్రయిస్తుంటారు. ఒక్కో గ్లాస్ ధర రూ.30 నుంచి రూ.50 వరకు ఉంటుంది. అయితే శీతల పానీయాల్లో వినియోగించే ఐస్ విషయంలో జాగ్రత్తలు వహించాలని వైద్యులు సూచిస్తున్నారు. శుభ్రమైన ఐస్ దొరకడం కష్టం కాబట్టి... ఐస్ లేకుండా వినియోగించడమే మేలని చెబుతున్నారు.

ఆయన జీవితమే.. ఉద్యమం

(ఐదో పేజీ తరువాయి)

హనుమంతు ఉష విజయవాడలో ఉండగా.. మరో సోదరి జలజాక్షి మెళియాపుట్టి మండలం శేఖరాపురంలో నివసిస్తోంది. ఇంకో సోదరి సత్యవతి హైదరాబాద్‌లో ఉంటున్నారు. విశాఖ సెంట్రల్‌జైల్‌లో కేశవరావు ఉన్న సమయంలో తండ్రి వాసుదేవరావు అప్పుడప్పుడూ వెళ్లి కలుస్తూండేవారు. ఉద్యమాల్లో చేరిన తర్వాత కేశవరావు స్వగ్రామానికి ఎప్పుడూ రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. కేశవరావుకు సంబంధించి ఇంట్లో ఉన్న ఫొటోలు అన్నీ కాల్చేయడంతో ఆయన ఆచూకీ పెద్దగా గుర్తించలేకపోయారు. కేశవరావు చదువుకుంటున్న రోజుల్లో గల ఒక ఫొటోను ఇన్నాళ్లు పోలీసులు అలియాస్ గంగన్న, బసవరాజుగా చూపించారు. గత ఏడాది అక్టోబరు 10న ఛత్తీస్‌గడ్ పరిధి అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్ కౌంటర్‌లో కేశవరావు మృతి చెందాడని ప్రచారం జరిగింది. అయితే దీన్ని పోలీసులు, మావోయిస్టులు ఎవరూ ధ్రువీకరించలేదు. ఈసారి నారాయణపూర్ జిల్లా అడవుల్లో ఎన్‌కౌంటర్‌లో కేశవరావు మృతి చెందాడని తెలవడంతో జీయన్నపేటలో విషాదఛాయలు కనిపించాయి. వాస్తవానికి కేశవరావు మావోయిస్టు చీఫ్‌గా వ్యవహరిస్తుండడం వలన మూడంచెల భద్రత ఉంటుంది. తొలి అంచెలో పీఎల్‌జీఏ సెక్యూరిటీ, రెండో అంచెలో సీ6 యూనిట్, మూడో దశలో రెగ్యులర్ దళాలు రక్షణగా ఉంటాయి. మొత్తంగా కేశవరావు మృతి వారి కుటుంబ సభ్యుల్ని అడిగితే తమకేమీ సమాచారం లేదంటున్నారు. ఆ గ్రామస్థులు కొందర్ని ప్రశ్నిస్తే టీవీల్లో చూడడం, పేపర్లలో చదవడం తప్ప ఆయన గురించి తమకేమీ తెలియదంటున్నారు.


సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ తదితరులు

'మాటామంతీ'కి సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు సమావేశమై మన ఊరు.. మాటామంతీ కార్యక్రమం రూపకల్పన చేశారు. ఉదయం 8.30గంటల నుంచి 10.35 గంటల వరకు టెక్కలిలో భవానీ థియేటర్ తెరపై వర్చువల్ విధానంలో పవన్‌కల్యాణ్ మాట్లాడనున్నారు. బుధవారం ఉదయం పంచాయతీరాజ్ కమిషనర్ వర్చువల్‌గా ట్రైల్‌రన్ నిర్వహించారు.

● మాటామంతీ కార్యక్రమంలో గురువారం కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్ రావివలస గ్రామానికి చెందిన జనాభా, గ్రామ ఆవాసాలు, వనరులు, మౌలిక సదుపాయాలు వివరిస్తారు. రావివలస పంచాయతీలో ఎంపిక చేసిన పదిమంది.. డిప్యూటీ సీఎం సమస్యలు వివరించేందుకు అవకాశం కల్పిస్తారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి పవన్ ప్రసంగిస్తారు. ఎండల మల్లన్న ఆలయానికి సంబంధించిన అంశాలు, గ్రామ పరిధిలో భూ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, ఇంటర్నల్ రోడ్స్, మూతపడిన ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమ, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రైతు సమస్యలు, టూరిజం అంశాలు, గొర్రెలు, మేకలు పెంపకందారుల సమస్యలను గ్రామస్థులు పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రూ.17కోట్ల3లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో చింతాడ లక్ష్మీబాయి, తహసీల్దార్ రవికుమార్, డీఈఈలు రామకృష్ణ, సుధాకర్, స్థానిక నాయకులు ఎల్ఎల్ నాయుడు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కణితి కిరణ్‌కుమార్, బడే జగదీష్, నర్తు కృష్ణ, అనపాన జనార్దన్‌రెడ్డి, ఇప్పిలి జగదీష్ పాల్గొన్నారు.

40 ఏళ్లు టీడీపీదే అధికారం

(ఐదో పేజీ తరువాయి)

తీస్తాన'ని ఎమ్మెల్యే రవికుమార్ హెచ్చరించారు. నియోజక వర్గంలో అభివృద్ధిని చూడలేని కొంతమంది వైసీపీ చోటా నాయకులు ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు వెళుతున్నారని, వారికి కష్టం లేకుండా శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజాదర్బార్‌లో తమ సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చునని తెలిపారు. తెలుగుజాతి ఉన్నంత వరకు.. టీడీపీ ఉంటుందన్నారు. కార్యకర్తలు గ్రూప్‌లు, మౌనం, అలకలు మాని గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. వైసీపీ వక్రబుద్ధి ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిచ్చా రు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చంద్రశేఖర్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, నాలుగు మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్, మాజీ మునిసిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తమ్మినేని సుజాత, భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

మొదలైంది గురూ..

(ఐదో పేజీ తరువాయి)

అసిస్టెంట్‌లకు పదోన్నతి కల్పించి.. మరుసటి రోజున ఆర్డర్లు ఇవ్వాలని షెడ్యూల్‌లో స్పష్టం చేశారు. ● ఉపాధ్యాయుల బదిలీ దరఖాస్తుకు సంబంధించి రెండు కాపీలు సంబంధిత డీడీలకు అందజేయాలి. గ్రేడ్-2 హెచ్‌ఎంలు అయితే డిప్యూటీ డీఈవోలకు, ఎస్ఏలు హెచ్‌ఎంలకు, ఎస్జీటీలు ఎంఈవోలకు అందజేయాలి. షెడ్యూల్ ప్రకారం సీనియార్టీ జాబితాలపై గ్రీవెన్స్‌ను స్వీకరించేందుకు.. శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక కౌంటర్‌ను విద్యాశాఖ అధికారులు ఏర్పాటు చేశారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

(ఐదో పేజీ తరువాయి)

ఉంటాయని తెలిపారు. ప్రతీ ఒక్కరూ యోగాంధ్ర వెబ్‌సైట్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అలాగే యోగాపై డిబేట్, వ్యాసరచన, తదితర పోటీలను నిర్వహిస్తామన్నారు. ప్రజలంతా కుటుంబసమేతంగా సాధన చేసి ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వేంకటేశ్వరరావు, ఆర్డీఓ కె.సాయిప్రత్యూష, పర్యాటక శాఖాధికారి ఎన్.నారాయణరావు, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత, యోగా టీచర్లు మురళీ, తంగి స్వాతి, వారణాశి సందీప్, దేశళ్ల సురేంద్ర, రామారావు, గాయత్రి, జిల్లా అధికారులు, వివిధ యోగా సంస్థల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన కాళికా నృత్యాలు

● 42 ఏళ్ల తరువాత తలతంపరలో అమ్మవారి ఉత్సవాలు
● 14 గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహణ

కంచిలి, మే 21 (ఆంధ్రజ్యోతి): తలతంపర గ్రామంలో 14 పుట్టుగల (గ్రామాల) ప్రజల ఆరాధ్యదేవత శ్రీసింధుపత్రాణి అమ్మవారి సంబరాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. సుమారు 42 సంవత్సరాల తరువాత ఈ సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసినా కాళికా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. అమ్మవారిని ప్రధాన ఆలయం నుంచి గ్రామంలోని ఉపాలయానికి మేళతాళాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, కోయడ్యాన్సులతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. తలతంపర, కొన్నాయిపుట్టుగ, సూదిపుట్టుగ, కొక్కిలిపుట్టుగ, ఆముదాలపుట్టుగ, మజ్జిపుట్టుగ, నాథపుట్టుగ, కాళింగపుట్టుగ, లండపుట్టుగ, చిల్లపుట్టుగ, కాకర్లపుట్టుగ, ప్రధానపుట్టుగ తదితర గ్రామాల ప్రజలు ఈ ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఏటా దసరా ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని గ్రామానికి తీసుకురావడం ఆనవాయితీ అని చెప్పారు. సుమారు 42 సంవత్సరాల తరువాత వేసవి కాలం సంబరాలు చేస్తున్నట్టు వెల్లడించారు. రోజుకు రెండు గ్రామాల చొప్పున 14 గ్రామాల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కంచిలి పోలీసులు, కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


సింధుపత్రాణి అమ్మవారు


ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కాళికా వేషాలు

వయ్యారిభామ.. కొంప ముంచేనమ్మా!

● ఖాళీ స్థలాలు... పొలాల్లో భారీగా విస్తరిస్తున్న మొక్క
● మనుషులు, మూగ జీవాలకు వ్యాధుల ముప్పు

సోంపేట, మే 21 (ఆంధ్రజ్యోతి): తెల్లని పువ్వులతో.. ఆకట్టుకునే ఆకులతో సన్నగా కనిపించే ఈ మొక్క అందమంతా బయటికే. ఇది కలిగించే నష్టం మామూలుగా ఉండదు. ఆ మొక్క పేరు వయ్యారిభామ. ఈ మొక్కలతో ప్రజలకు అనేక అనర్థాలు కలుగుతున్నాయి. పంట పొలాల్లో అత్యధికంగా కనిపించే కలుపు మొక్కల్లో వయ్యారి భామ ఒకటి. పొలాలు, ఖాళీ ప్రదేశాలలో అధికంగా ఈ మొక్క కనిపిస్తుంది. ఇది సమస్యాత్మక కలుపు మొక్క. దీని శాస్త్రీయ నామం పార్థీనియం హిస్టిరో ఫోరెస్. దీన్నే కాంగ్రెస్ గడ్డి, నక్షత్ర గడ్డి అని కూడా పిలుస్తారు. ఈ మొక్క విత్తన సామర్థ్యం ఎక్కువ. ఒక మొక్క పదివేల నుంచి 50 వేల వరకు విత్తనాలను ఉత్పత్తి చేస్తుంది. ఆ విత్తనం గాలి, నీరు, పశువుల ద్వారా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుంది.


బహిరంగ ప్రదేశంలో పెరిగిన వయ్యారిభామ మొక్కలు

వ్యాధుల భయం..

ఈ మొక్కలలో పార్థీనిన్, హిస్టరిన్, ఆంబ్రోసిన్ తదితర హానికరమైన రసాయనాలు ఉండడంతో శరీరానికి తగిలినప్పుడు దురద, చర్మం కందిపోవడం, కళ్లు ఎర్రబడడం, జలుబు, గాలి పీల్చడం వల్ల ఆస్మా తదితర వ్యాధులు వస్తాయని వైదులు చెబుతున్నారు.

పాల దిగుబడి తగ్గిపోతుంది..

మనుషుల లాగానే పశువులు వయ్యారి భామ మొక్కలు తింటే పేగుల్లో పుండ్లు, బరువు తగ్గడం, పాల ఉత్పత్తి తగ్గుతుంది. పాల వాసన మారి.. వినియోగానికి ఉపయోగపడని పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని చెబుతున్నారు.

నివారణ ఇలా..

పెండి మిథాలిన్ కలుపు మందు ఎకరానికి ఒకటిన్నర లీటర్ల చొప్పున చల్లితే వీటిని చాలా వరకు నివారించవచ్చునని వ్యవసాయ శాస్త్రవేత్త లు చెబుతున్నారు. మొక్కజొన్నలో అయితే ఎట్రాజిన్ 50 ఎకరానికి కిలో చొప్పున పిచికారీ చేయడం ద్వారా కూడా నివారించవచ్చు. ఖాళీ ప్రదేశాల్లో దీని నివారణకు లీటరు నీటికి రెండు గ్రాముల సోడియం సాల్ట్ కలిపి పిచికారీ చేయాలి. కలుపు లేతగా ఉన్నప్పుడే నివారణకు బాగుంటుంది. అవసరాన్ని బట్టి ఈ మందులు పిచికారీ చేయడం ద్వారా తొలగించవచ్చు. వయ్యారిభామ ఉధృతంగా పెరిగే ప్రదేశాల్లో ఆసియా సెరెషియా వంటి మొక్కల విత్తనాలు ఎకరానికి 12 నుంచి 15 కిలోలు చల్లాలి. జైగో గ్రామా బైకాలరేటా అనే పెంకు పురుగును ఆ ప్రాంతాల్లో వదిలితే... వాటిని తిని ఆమొక్కల ఉధృతిని తగ్గిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ప్రయాణికులకు ఇబ్బంది..

రైల్వే ట్రాక్‌ల వెంబడి ఉండే వయ్యారిభామ మొక్కల వల్ల వచ్చే గాలిని పీల్చి రైలు ప్రయాణికులు 25 నుంచి 30 శాతం మంది అనేక రకాలైన వ్యాధులకు గురవుతున్నట్లు తాజాగా జరిగిన జీవశాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. ఇది అందరినీ ఆందోళనకు గురిచేస్తుంది.

అన్నదాతకు నష్టం..

పంట భూములలో ఈ కలుపు మొక్కల వల్ల 10 నుంచి 15 శాతం మేర పంట దిగుబడి తగ్గుతుందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

10 నుంచి 15 శాతం పంట నష్టం..

సాగు చేసే ఏ భూమిలోనైనా వయ్యారిభామ చెట్లు పెరగడం వల్ల 10 నుంచి 15 శాతం మేర పంట దిగుబడి తగ్గిపోతుంది. ఎటువంటి వాతావరణ పరిస్థితినైనా తట్టుకునే శక్తి దీనికి ఉంటుంది. ఓ ఉద్యమంలా చేపట్టి మందులు, జీవ నియంత్రణ కార్యక్రమాలకు శ్రీకారం చేపడితే తప్ప పూర్తిగా నివారించలేం. వీటికి కలుపు తీయించడం కూడా మంచిదే.

-బి.నరసింహమూర్తి, ఏవో, సోంపేట

హనుమాన్ ఆలయంలో మహా కుంభాభిషేకం


కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్, మే 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుణ్యపు వీధిలో ఉన్న శ్రీ సీతారామచంద్ర మూర్తి సహిత అభయాంజనేయ స్వామి ఆలయంలో బుధవారం మహా కుంబాభిషేక మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 301 కలశాలతో పసుపు-కుంకుమ, చందనం కలిపిన నీళ్లతో మహా కుంబాబిషేకం నిర్వహించారు. అర్చకులు నేతేటి హరిబాబు ఆద్వర్యంలో మండపారాధన చేశారు. అనంతరం సువర్చల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


మహాకుంభాభిషేకం చేస్తున్న దృశ్యం

హైవే ప్రమాదాల నియంత్రణపై దృష్టి సారించండి

- పకడ్బందీగా పెట్రోలింగ్ విధులు
- ఎస్పీ మహేశ్వరరెడ్డి



సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు

మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మే 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి మార్గంలో ప్రత్యేక కార్యచరణతో ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. హైవేపై ట్రాఫిక్, ప్రమాదాలు, నేరాల నియంత్రణ, సహాయక చర్యలపై పెట్రోలింగ్ సిబ్బంది నిర్వహించాల్సిన విధులు తదితర అంశాలపై బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. రహదారులపై నేరాలు, ప్రమాదాలు నివారించడం, ప్రయాణికులకు సహాయం అందించడం పెట్రోలింగ్ ముఖ్యవిధి అని, ఆ దిశగా అప్రమత్తంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలన్నారు. వాహనాల మెంటినెన్స్ సక్రమంగా ఉండాలన్నారు. రోడ్డుకిరువైపులా లారీలు, ఇతర భారీ వాహనాలు పార్కింగ్ లేకుండా చూడాలన్నారు. కేటాయించిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు పార్కింగ్ చేసేలా చూడాలన్నారు. సర్వీస్ రోడ్డు మార్గంలో వాహనాలు రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాలు నియంత్రించాలని తెలిపారు. హైవే మార్గంలో దాబా, హోటళ్లు నిర్ణీత సమయానికి మూయించాలన్నారు. వేకువ జామున సమయంలో టోల్‌ప్లాజా, చెక్‌పోస్టుల వద్ద వాహనచోదకులకు నిరంతరం ఫేస్‌వాష్ కార్యక్రమం జరిపించాలన్నారు. ప్రమాద హెచ్చరిక, మలుపు అతివేగంగా నియంత్రణ, సూచిక బోర్డులు, స్టాపర్స్, సోలార్ బ్లింకర్స్ నిర్వహణ సక్రమంగా ఉండేలా హైవే అథారిటీ సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఉన్న సిబ్బంది రేడియో జాకెట్లు తప్పక ధరించాలని ఆదేశించారు. రోడ్లపై ట్రాఫిక్ క్రమబద్ధీకరించడం, ట్రాఫిక్ జామ్‌లు నివారించడం వంటి హైవే పెట్రోలింగ్ సిబ్బంది బాధ్యతగా నిర్వర్తించాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే సమయంలో వెంటనే ప్రమాద ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు అందించి క్షతగాత్రులను దగ్గరలో ఉన్న ఆసుపత్రులకు 108 అంబులెన్స్ సహకారంతో తీసుకెళ్లాలని తెలిపారు. రోడ్డుపై ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే హైవే పెట్రోలింగ్ సిబ్బంది వెంటనే స్పందించి సాయమందించాలన్నారు. హైవే సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిని గుర్తించి రహదారి భద్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమీక్షలో ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు సీహెచ్ వివేకానంద, ఎంవీ అప్పారావు, సీఐలు పైడపునాయుడు, అవతారం, విజయ్‌కుమార్, తిరుపతిరావు, శ్రీనివాస్, ఆర్ఐ కె.నరసింగరావు, ఎస్ఐలు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపురం ఆనకట్ట పనుల్లో అవకతవకలు

- ఇంజనీరింగ్ అధికారులకు ఇంక్రిమెంట్ కోత
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

శ్రీకాకుళం, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ఇరిగేషన్ డివిజన్ పరిధిలో నిర్వహించిన నారాయణపురం ఆనకట్ట పనుల్లో అవతవకలు జరిగాయని గతంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. దీనిపై విచారణ నిర్వహించింది. ప్రత్యేకంగా విచారణ అధికారిని నియమించి నివేదికను పరిశీలించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన నివేదికను కూడా పరిగణనలోకి తీసుకుంది. దీనిపై అప్పటి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు కె.రమణ, బి.రవీంద్ర, అప్పటి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.రవికుమార్‌పై అభియోగాలు నమోదయ్యాయి. ఈ మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా ఒక ఇంక్రిమెంట్‌ను జరిమానాగా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు.

ఘనంగా మినీ మహానాడు

ఆమదాలవలస, మే 21(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం మినీ మహానాడు ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మొదలవలస రమేష్ తొమ్మిది అంశాలపై తీర్మానాలు ప్రవేశపెట్టగా వేదికపై ఉన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు బలపరిచి ఆమోదించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పలువురికి పలువురి కి పదవులతో గుర్తించడం జరిగింది. వారిని ఎమ్మెల్యే కూన రవికుమార్, కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు ఆధ్వ ర్యంలో ఘనంగా సన్మానించారు. డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారా యణ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, నారాయణపురం ఆనకట్టు చైర్మన్ సనపల డిల్లీశ్వరరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బొనెల అప్పారావు, ఎన్టీఆర్ జీవిత చరిత్ర రచించిన రిటైర్డు ఉపాధ్యాయులు పీవీ నరసింహలను సన్మానించారు. పొందూరు మండలం ధర్మపురం గ్రామానికి చెందిన టీడీపీ వీరాభిమాని మరగుజ్జి దివ్యాంగుడు వేదికపైకి వచ్చి రవికుమార్ రామ్మోహన్‌నాయుడుల మధ్య సోఫాపై కూర్చొని అందరికీ తెలుగుదేశం సహనం చూపించారు. దీంతో ఎమ్మెల్యే కేంద్ర మంత్రి ఆ వ్యక్తిని అభినందించి పార్టీ కండువాలు వేసి అభినందనలు తెలిపారు.



వీర జవాన్ మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న టీడీపీ శ్రేణులు

వీరజవాన్‌కు నివాళి..

మినీ మహానాడు ప్రారంభానికి ముందు ఎమ్మెల్యే రవికుమార్ పాకిస్తాన్ భారత్ సింధూర్ ఆపరేషన్ ప్రాముఖ్యత వివరిస్తూ సైనికులకు అభినందనలు తెలిపారు. అదే విధంగా సింధూర ఆపరేషన్‌లో వీరమరణం పొందిన రాష్ట్రానికి చెందిన మురళీనాయక్‌కు నివాళులు అర్పిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

మినీ మహానాడు విజయవంతం చేయండి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ

అరసవల్లి, మే 21(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గురువారం జరుగనున్న మినీ మహానాడుకు పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించనున్న మినీ మహానాడు ఏర్పాట్లపై ఆయన పార్టీ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఘనంగా నిర్వహించనున్న మినీ మహానాడులో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తోపాటు ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఏఎంసీ చైర్మన్లు హాజరుకానున్నట్టు తెలిపారు. ఇచ్చిన హామీలు అమలు చేసే దిశగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఈ ఏడాది పాలనాలో చేసిన సంక్షేమం, అభివృద్ధి పనులపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి పార్టీ జిల్లా కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పీఎంజే బాబు, మాదారపు వెంకటేష్, కలగ జగదీష్, మెండ దాసునాయుడు, సింతు సుధాకర్, పాండ్రంకి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు సరికాదు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎండీయు ఆపరేటర్లు

శ్రీకాకుళం కలెక్టరేట్/ శ్రీకాకుళం అర్బన్, మే 21(ఆంధ్రజ్యోతి): నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఎండీయూ ఆపరేటర్ల తొలగింపు సరికాదని ఆ సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ, ఏఐటీయూసీ నాయకుడు టి.తిరుపతిరావు అన్నారు. నగరంలోని ఎన్జీవో హోమ్‌లో ఎండీయూ ఆపరేటర్లు బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 9,260మంది ఆపరేటర్లు, 9,260 మంది సహాయకులు పనిచేస్తున్నారని, వీరంతా ఎలా బతకాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విధుల్లో చేరిన సమయంలో 72 నెలల అగ్రిమెంట్ ఉందని, అంటే మరో రెండేళ్లపాటు విధుల్లో కొనసాగే అవకాశం ఉందని, కానీ ప్రభుత్వం రాత్రికిరాత్రే అనాలోచిత నిర్ణయంతో వేల కుటుంబాలను రోడ్డున పడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, లేకుంటే కలెక్టరేట్ల వద్ద ధర్నా చేస్తామన్నారు. అనంతరం బైక్ ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు. డీఎస్‌వోకు వినతిపత్రం అందజేశారు ఎండీయూ ప్రతినిధులు హేమసుందర్, వరహా నరసింహులు, వెంకట్రావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రిమ్స్ నర్సింగ్ కళాశాలలో ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం



ర్యాలీలో పాల్గొన్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు తదితరులు

శ్రీకాకుళం రిమ్స్, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నర్సింగ్ (రిమ్స్) కళాశాలలో బుధవారం ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు దేశభక్తిని ప్రేరేపించే 'ఆపరేషన్ సిందూర్' అనే నాటికను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అలాగే ఈ నెల 20న జాతీయ సమైక్యతా, మతసామ రస్యంపై పోటీలు నిర్వహించి, గెలుపొందన వారికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ కళాశాల నుండి శాంతినగర్ కాలనీ వరకు సందేశాత్మక నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.ఝాన్సీ లక్ష్మీబాయి, ఎన్ఎస్ఎస్ అధికారి కె.పద్మావతి, ప్రోగ్రాం అధికారి పి.సునీత, ఎం.మిచల్, లెక్చరర్లు పుష్పలీల, హరిప్రియ, బోధనా సిబ్బంది కె.శ్రీదేవి, నర్సింగ్ ట్యూటర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాడీ బిల్డింగ్ పోటీల్లో కవిటి కుర్రోడి ప్రతిభ



రోహిత్‌కు షీల్డ్ అందిస్తున్న దృశ్యం

కవిటి, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో జరిగిన జోనల్‌స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో కవిటి గ్రామానికి చెందిన ఎం.రోహిత్ జూనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచాడు. అలాగే 75 కిలోల విభాగంలో రెండో స్థానం సంపాదించాడు. రోహిత్‌కు జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సభ్యులు, ఇచ్ఛాపురం బాడీ బిల్డింగ్ సభ్యులు, కవిటి జిమ్ కోచ్ దుదిష్టి మజ్జి, సభ్యులు, ఉషోదయ సంఘ సభ్యులు, గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్

సోంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): సుంకిడి గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆంజనేయస్వామి విగ్రహప్రతిష్ఠా మహోత్సవంలో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్ర మోహన్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఏపీ ఈఏపీ సెట్

ఎచ్చెర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ ఈఏపీ సెట్-2025 కొనసాగుతోంది. జిల్లాలోని నాలుగు కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతోంది. బుధవారం రెండు షిఫ్టుల్లో కలిపి శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో 559కు 536 మంది, వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో 339కు 322 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతాయి.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రణస్థలం, మే 21(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మెగా జాబ్‌మేళా 21 ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. 781 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 302 వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు.సాయికుమార్, ఎన్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ డైరెక్టర్ ఎన్.తేజా, జిల్లా ఉపాధి అధికారి సుధ, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఏడీ డిసెబుల్డ్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

యువత ఆదర్శంగా ఉండాలి



న్యాయాధికారి వంశీకృష్ణను సన్మానిస్తున్న గ్రామస్థులు

గార, మే 21(ఆంధ్రజ్యోతి): యువత ఆదర్శంగా ఉంటూ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అనపర్తి సివిల్ కోర్టు న్యాయాధికారి మజ్జి వంశీకృష్ణ అన్నారు. కళింగపట్నం పంచాయతీ నగరాలపేట గ్రామానికి చెందిన వంశీకృష్ణ న్యాయాధికారిగా ఎంపికై బుధవారం తొలిసారిగా గ్రామానికి ఆయన వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. గ్రామంలో ఉన్న ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానికులు పెద్దలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధి పనులు పూర్తి చేయించండి

మెళియాపుట్టి, మే 21(ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులను పూర్తి చేయాలని ఎంపీడీవో ప్రసాద్‌పండా అన్నారు. బుధవారం ఉపాధి అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షాలు పడుతున్నందున గుర్తించిన పనులను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. సాగునీటికి ఉపయోపడే పనులు చేయించడంలో అలసత్వం వద్దన్నారు.

శస్త్ర చికిత్సకు 15 మంది ఎంపిక

వజ్రపుకొత్తూరు, మే 21(ఆంధ్రజ్యోతి): పొల్లాడలో బుధవారం ఉద్దానం అభ్యుదయ సేవాసమితి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు చేసి వారిలో 15 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టాడ రఘు, నాయకులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలి



అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు వివరిస్తున్న అధికారి

పొందూరు, మే 21(ఆంధ్రజ్యోతి): పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి బెందాళం అశోక్ అన్నారు. కల్యాణిపేట గ్రామం వద్ద గల పెట్రోల్ బంకు వద్ద అగ్నిప్రమాదాల సమయంలో ఎలా వ్యవహరించాలి అనే అంశంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యంగా గృహాల్లో గ్యాస్ ప్రమాదాలు, పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదాలు జరిగినపుడు భయపడకుండా తీసుకోవాల్సిన చర్యలు వివరించారు. కార్యక్రమంలో పొందూరు అగ్నిమాపక సిబ్బంది ఎ.రామకృష్ణ, బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంతో ఆరోగ్యకరమైన ఆహారం

కంచిలి, మే 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఆరోగ్యవంతమైన ఆహారం సేంద్రియ విధానంతోనే లభిస్తుందని మండల యాంకర్ టి.శివానందం అన్నారు. చిన్నకొజ్జిరీయ, భోగాబేణి గ్రామాల్లో ఖరీఫ్ ప్రణాళికపై రైతులకు అవగాహన కార్యక్రమాలు, ర్యాలీ ప్రకృతి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సేంద్రియ విధానంలో పంటలు పండించడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గనప సింహాచలం, కుణితి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

27న అమరవీరుల స్మారక సభ

పలాసరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళ సాయుధ పోరాటంలో వీరుల త్యాగాలు మరువలేనివని, వారిని తలచుకునేందుకు ఈనెల 27న 36వ అమరుల వీరుల స్మారక సభను నిర్వహిస్తున్నామని ప్రజా సంఘాల నేతలు అన్నారు. బుధ వారం బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం ఆవరణలో కరపత్రాలను ఆవి ష్కరించారు. స్మారక కమిటీ కన్వీనర్ జోగి కోదండరావు, సీపీఐఎంఎల్ న్యూడెమో క్రసీ జిల్లా సహాయకార్యదర్శి వంకల మాధవరావు, ఎస్.వీరాస్వామి పాల్గొన్నారు.

24న మండల సమావేశం

పాతపట్నం, మే 21(ఆంధ్రజ్యోతి): మం డల సర్వసభ్య సమావేశం ఈనెల 24వ తేదీన ఎంపీపీ సావిత్రమ్మ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో చంద్రకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాల ని, సభ్యులు హాజరుకావాలని కోరారు.


డ్రోన్‌తో ప్రత్యేక నిఘా

శ్రీకాకుళం క్రైం, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ శివారు నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘాతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు గాలింపు చర్యలు చేపడుతున్నారు. బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశాలు మేరకు రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కిమ్స్ ఆసుపత్రి, ఖైరివానిపేట, బలగ తదితర ప్రాంతాలతో పాటు నదీ తీర పరివాహక ప్రాంతాల్లో డ్రోన్ నిఘా ఉంచారు బహిరంగంగా మద్యం తాగడం, గంజాయి సేవించడం, పేకాట, ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్ తదితర నేరాలు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ నిఘాను ఏర్పాటు చేసినట్టు పోలీసులు చెబుతున్నా రు.

ఉన్నత పాఠశాల మంజూరుపై హర్షం

కవిటి, మే 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని బెజ్జిపుట్టుగ పంచాయతీ పెద్దకర్రివానిపాలెం గ్రామంలోనున్న పాఠశాలను ఉన్నతపాఠశాలగా ఈ ఏడాది మంజూరు చేయడంపై గ్రామస్థులు హర్షం తెలిపారు. ఈ మేరకు బుధవారం రామయ్యపుట్టుగలో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, ఎంఈవో ధనుంజయ మజ్జిలను సత్కరించారు. తీరప్రాంత గ్రామంలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేయడంతో మాగ్రామాల విద్యార్థులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని గ్రామస్థులు అన్నారు.

కొండచిలువ హతం



పొందూరు, మే 21(ఆంధ్రజ్యోతి): లక్ష్మీపేట గ్రామంలో గ్రామస్థులు 10 అడుగుల కొండచిలువను చంపారు. గ్రామంలో మాసాడ గోపి అనే వ్యక్తి ఇంటిపైకి కొండచిలువ చేరింది. అదే సమయంలో గోపి కుమార్తె ఐదేళ్ల చిన్నారి ఆడుకోవడానికి డాబా పైకి వెళ్లింది. కొండలువను చూసి భయపడి కిందకి వచ్చింది. గోపి కుటుంబ సభ్యులు పైకి వెళ్లి చూసేసరికి 10 అడుగులపైన ఉన్న కొండచిలువ కనిపించింది. ఈ విషయం గ్రామంలో యువకులకు చెప్పడంతో వారు కొండచిలువను కొట్టి చంపారు.

పక్కాగా మైక్రో క్రెడిట్ ప్లాన్

హరిపురం, మే 21(ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల్లో అమలు చేస్తున్న క్రెడిట్ ప్లాన్‌ను పక్కాగా చేపట్టాలని ఏపీఎం పి.కూర్మారావు తెలిపారు. కొత్తపల్లిలో గ్రామైక్య సంఘం సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. మైక్రో క్రెడిట్ ప్లాన్‌లో బయోమెట్రిక్ వినియోగం, రుణ సూక్ష్మ ప్రణాళిక కచ్చితత్వం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో వీవోఏ బి.చంద్ర కళ, సీసీలు బాలకృష్ణ, తారక్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వృథాగా సర్వే రాళ్లు



పశువైద్యశాల ఎదురుగా వృథాగా పడివున్న సర్వేరాళ్లు

గార, మే 21(ఆంధ్రజ్యోతి): కళింగపట్నంలో పశువైద్యశాల ఆవరణలో ఎదురుగా వందలాది సర్వే రాళ్లు వృథాగా పడి ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భూముల హద్దులు నిర్ణయించడానికి ఉద్దేశించి లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన ఈ సర్వే రాళ్లు ఇక్కడ ఇలా మూడేళ్లుగా పడి ఉన్నాయి. వీటి వినియోగం లేకపోవడంతో వీటిచుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయి కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీటిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి

సోంపేట, మే 21(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.

పోలీసు లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



మృతదేహం వద్ద గౌరవ సూచకంగా గాలిలో కాల్పులు జరుపుతున్న పోలీసులు

నందిగాం, మే 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పెంటూరు గ్రామానికి చెందిన జవాన్ పిన్నింటి దొరబాబు అంత్యక్రియలు బుధవారం పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. నరసన్నపేట మండలం సత్యవరం జంక్షన్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దొరబాబు మృతి చెందిన విషయం తెలిసిందే. బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆర్మీ, ఏఆర్, ఎన్‌సీసీ, సివిల్ పోలీసులు పెంటూరు శ్మశాన వాటిక వద్ద గౌరవ వందనం చేశారు. మృతదేహంపై జాతీయ జెండాను కప్పి మూడు పర్యాయాలు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం తండ్రి సదానందం కుమారుడి మృతదేహానికి అంత్యక్రియలు చేశారు. జాతీయ జెండాను మృతుడి భార్య కాంచనకు పోలీసులు అప్పగించారు. దొరబాబు మృతితో కుటుంబ సభ్యులతో పాటు గ్రామ స్థుల రోదనలు మిన్నంటాయి. మృతుడికి పిల్లలు చిన్నవారు కావడంతో వారి బేలచూపులు చూపరులను కన్నీరు పెట్టించాయి.

గల్లంతైన వ్యక్తి మృతి

రణస్థలం, మే 21(ఆంధ్రజ్యోతి): నారువ గ్రామానికి చెందిన నిద్రబంగి సంతోష్(32) స్నేహితులతో మంగళవారం సముద్ర స్నానానికి వెళ్లి గల్లంతైన విషయం విదితమే. జేఆర్ పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి చెప్పిన వివరాల మేరకు.. సంతోష్, రమణ, సూర్యనారాయణ సముద్ర స్నానం కోసం మంగళవారం దోనిపేట తీరానికి వెళ్లారు. అయితే ముగ్గురు స్నానం చేస్తున్న సమయంలో పెద్ద కెరటం రావడంతో సంతోష్ గల్లంతయ్యాడు. బుధవారం సంతోష్ మృతదేహం బుధవారం దోనిపేట తీరానికి చేరుకుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ మహారాష్ట్ర వాసి..

హిరమండలం, మే 21(ఆంధ్రజ్యోతి): వంశధార రిజర్వాయర్ పనుల కోసం వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు మేడపైనుంచి పడి తీవ్రంగా గాయపడి విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్‌ఐ ఎండీ యాసిన్ తెలిపారు. ఆ వివరాలిలా ఉన్నాయి.. వంశధార రిజర్వాయర్ నిర్మాణం నిమిత్తం కూలి పనులు చేసేందుకు మహారాష్ట్రలోని నాగపూర్ నుంచి కమలేష్‌కుమార్(41) వచ్చాడు. కూలీలకు కేటాయించిన లేబర్ క్యాంపు మేడపై ఠాకూర్ సోమవారం రాత్రి పడుకున్నాడు. తెల్లవారుజామున కిందకు దిగు తుండగా నిద్రమత్తులో మేడ మీద నుంచి పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స కోసం తోటి కూలీలు మంగళవారం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఠాకూరు ముందురోజే రిజర్వాయర్ నిర్మాణం పనుల కోసం వచ్చినట్లు సంబంధిత కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు.

కుమార్తె అదృశ్యంపై తండ్రి ఫిర్యాదు

ఎచ్చెర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): తన కుమార్తె షేక్ అలీమ్(19) ఈనెల 19వ తేదీ నుంచి కనిపించడం లేదని లింగాలపేటకు చెందిన తండ్రి షేక్ ఉమర్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పదో తరగతి చదివిన ఆమె టైలరింగ్ నేర్చుకుంటానని చెప్పి 19న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

9.2 కిలోల గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం, మే 21(ఆంధ్రజ్యోతి): గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి 9.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నంనాయుడు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా గేరేగేడి గ్రామానికి చెందిన గమేష్ నాయక్ ఒడిశా రాష్ట్రం కందమల్ జిల్లా తిలోరి గ్రామానికి చెందిన అజిత్ ప్రధాన్, సుభాష్ వీరి నుంచి 9.2 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దీన్ని కర్ణాటక రాష్ట్రం మైసూర్ నగరానికి తీసుకువెళ్లి అక్కడ బబ్బూ కుమార్ అనే వ్యక్తికి అమ్మేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఈ క్రమంలో ఒడిశాలో కొనుగోలు చేసిన బస్సులో ఇచ్ఛాపురం చేరుకున్నాడు. అక్కడి నుంచి రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. ఈ క్రమంలో పట్టణ ఎస్‌ఐ ముకుందరావుకు గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం వచ్చింది. వెంటనే సిబ్బందితో రైల్వే స్టేషన్‌కు చేరుకుని అతడిని తనిఖీ చేయగా.. గంజాయితో పట్టుబడ్డాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్‌ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో-ఆర్టీసీ బస్సు ఢీ.. 12 మందికి గాయాలు

గార, మే 21(ఆంధ్రజ్యోతి): బందరువానిపేట గ్రామం వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌తో పాటు 12 మంది గాయపడ్డారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బందరువానిపేట నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు, కళింగపట్నం వైపు నుంచి ప్రయాణికులతో వెళ్తున్న ఆటో రోడ్డు మలుపు వద్ద ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న పుక్కళ్ల లక్ష్మి, దేవీశ్రీ, గౌతమి తీవ్రంగా గాయపడ గా, మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే 108 వాహనాల్లో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. రిమ్స్ ఔట్‌పోస్టు పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఎం.చిరంజీవి తెలిపారు.



ఘటనా స్థలంలో ఆర్టీసీ బస్సు, ఆటో

అరకొర సదుపాయాలు

● ఇబ్బందులు పడుతున్న నిర్వాసితులు
● ఇదీ గోపివల్లభపురం 'ఆఫ్‌షోర్' నిర్వాసిత కాలనీ దుస్థితి



కాలనీలో కాలువలు లేని దృశ్యం



సరైన రోడ్లు లేని గోపివల్లభపురం ఆర్ఆర్ కాలనీ

పలాసరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): సాగు, తాగునీటి వనరులను అందించేందుకు ఉద్దేశించిన 'ఆఫ్‌షోర్' రిజర్వాయర్ నిర్మాణానికి భూములిచ్చిన వారి కోసం ఏర్పాటు చేసిన నిర్వాసిత కాలనీలో అరకొర సదుపాయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలాస మండలం రేగులపాడు వద్ద 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్ నిర్మాణానికి నిర్ణయించింది. నందిగాం మండలానికి చెందిన చిన గురుదాసుపురం, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, దాసుపురం, పలాస మండలం రేగులపాడు గ్రామాలకు చెందిన వారు నిర్వాసితులుగా ఉన్నారు. వీరిలో రేగులపాడు, చీపురుపల్లి గ్రామాల నిర్వాసితులకు టెక్కలిపట్నం పంచాయతీ గోపి వల్లభపురం గ్రామం వద్ద ఆర్ఆర్ కాలనీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. చీపురుపల్లి నిర్వాసితులు ఈ ప్రాంతంలో సుమారు 70 నుంచి 80 మంది ఇళ్లు కట్టుకుని నివసి స్తున్నారు. అయితే ప్రభుత్వం భూములిచ్చిన వారికి కాలనీలు ఏర్పాటు చేసినా సరైన రోడ్లు, కాలువలు లేకపోవడం, వర్షాకాలంలో కనీసం నడిచి వెళ్లేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నాలుగేళ్లుగా వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇటీవల ఉన్నతాధికారులు రేగులపాడు ఆఫ్‌షోర్ ప్రాంతంలో పర్యటించినప్పుడు సమస్యలను వారి దృష్టికి తీసు కువెళ్లినా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము విలువైన భూములను ప్రభుత్వానికి ఇచ్చినా మాకు కేటాయించిన కాలనీలో సరైన వసతుల కల్పన చేయ లేదని వాపోయారు. ఇప్పటికైనా ఆర్ఆర్ కాలనీలో సౌకర్యాలను ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దార్ ఎన్.కల్యాణ చక్రవర్తి వద్ద ప్రస్తావించగా పునరావాస కాలనీలో సమస్యలను పరిశీలించామని, ఎన్ఆర్ఈజీఎస్‌లో మౌలిక వసతుల కల్పనపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లామని, అనుమతులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభమవుతాయన్నారు.

మద్యం దుకాణానికి అనధికార విద్యుత్

● ఆంజనేయస్వామి ఆలయం నుంచి కనెక్షన్?

నరసన్నపేట, మే 21(ఆంధ్రజ్యోతి): మడపాంలో ఇటీవల ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి అనధికారికంగా విద్యుత్‌ను వాడుతున్నారు. సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం నుంచి కనెక్షన్ ఇవ్వడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయం నుంచి సుమారు 400 మీటర్లు విద్యుత్ వైరును సమీపంలోని తోటల గుండా తీసుకువచ్చి దుకాణానికి విద్యుత్ వినియోగిస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. తక్షణం తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వరరావు వద్ద ప్రస్తావించగా దుకాణానికి విద్యుత్ కనెక్షన్ నిమిత్తం అంచనాలు వేసి ఇచ్చినా భవన యాజమాని పట్టించుకోవడం లేదని, గతంలో మూడు పర్యాయాలు అనధికారికంగా ఏర్పాటు చేసిన కనెక్షన్‌ను తొలగించామన్నారు. నోటీసులు కూడా ఇచ్చామని, తగు చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



అనధికార విద్యుత్ కనెక్షన్ ఉన్న మద్యం దుకాణం ఇదే..

సర్వర్ డౌన్‌తో కంప్యూటర్ల మొరాయింపు

● 'సదరం'లో ఇబ్బందులుపడిన దివ్యాంగులు

నరసన్నపేట, మే 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆసుపత్రిలో సదరం ధ్రువీకరణ పత్రాల పునః పరిశీలకు బుధవారం ఆమదాలవలస మండలానికి చెందిన పలువురు దివ్యాంగులు వచ్చారు. అయితే ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సర్వర్ పనిచేసి ఒక్కసారి డౌన్ అయిపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సుమారు గంట పాటు వేచి ఉన్నా ఫలితం కనిపించపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. మరో పర్యాయం సమాచారం ఇస్తామని వైద్యులు చెప్పడంతో వెళ్లిపోయారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.శ్రీనివాసబాబు వద్ద ప్రస్తావించగా సాంకేతిక సమస్య ఏర్పడిందని, దీనిపై తామేమీ చేయలేమని పేర్కొన్నారు.

పోలీసు జాగిలంతో గ్రానైట్ క్వారీ తనిఖీ



క్వారీని పరిశీలిస్తున్న పోలీస్ జాగిలం

మెళియాపుట్టి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ముగ్గురు గ్రానైట్ కార్మికులు మృతికి కారణమైన దబ్బగూడ వీఆర్టీ గ్రానైట్ క్వారీని బుధవారం సాయంత్రం పోలీస్ జాగిలాలతో తనిఖీ చేపట్టారు. బ్లాస్టింగ్‌కి పేలుడు పదర్థాలు ఎక్కడైనా నిల్వ చేశారా అనే కోణంలో తనిఖీ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. కొండపైకి వెళ్లి అణువణువూ పరిశీలించారు. ఈ తనిఖీల్లో పాతపట్నం సీఐ రామారావు, తహసీల్దార్ పాపారావు, ఎస్‌ఐ రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

హేమశిరీషకు లోకేశ్ అభినందన



హేమ శిరీషకు బహుమతి ఇస్తున్న మంత్రి లోకేశ్

జలుమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): నగరికటకం గ్రామానికి చెందిన రావాడ హేమ శిరీష ను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. కరవంజ మోడల్ స్కూలులో పదో తరగతి చదివి 592 మార్కులు సాధించిన హేమ శిరీషకు మంగళవారం అమరావతిలో షైనింగ్ స్టార్స్ అవార్డును అందించారు. విద్యాశాఖమంత్రి లోకేశ్ చేతులు మీదుగా అవార్డు అందుకుని మోడల్ స్కూలుకి పేరు తెచ్చిన హేమశిరీషను ప్రిన్సిపాల్ గణేష్ పట్నాయక్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సత్యవతి, గోవిందరావు అభినందించారు.

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

కాశీబుగ్గ, మే 21 (ఆంధ్రజ్యోతి): జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు రూ.16వేలు ధర కల్పించి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి ప్రకటన చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మోహనరావు, జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ అజయ్‌కుమార్ కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జీడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జీడికి గిట్టుబాటు ధర, జీడి కార్పొరేషన్ ఏర్పాటుపై ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టు కోవాలన్నారు. జీడి సమస్యల పరిష్కారం కోసం ఈనెల చివరి వారం నుంచి దశల వారీ పోరా టానికి రైతులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. సమావేశంలో లక్ష్మీనారాయణ, రాజు, తారకేశ్వరరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాంబాబు మృతి తీరని లోటు



రాంబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, మే 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, యూనిట్ ఇన్‌చార్జి లుకలాపు రాంబాబు మృతి తీరని లోటని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. రాంబాబు సంతాప సభను బుధవారం నిర్వహించారు. మృతుడితో ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకుని టీడీపీ పోలాకి కేంద్రంలో మంచి నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు నేతలు రాంబాబు కుటుంబ సభ్యులను కలిసి సాను భూతి వ్యక్తంచేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన సంతాప సభలో పార్టీ సమన్వయకర్త బగ్గు అర్చన, నేతలు డోల జగన్, బైరి భాస్కరరావు, కిల్లి వేణు, సూరపు నారాయణదాస్, ధర్మాన తేజ్‌కుమార్, ఆబోతుల ప్రభాకరరావు, తూలుగు అశోక్‌కుమార్, మజ్జి రమణమ్మ, డా.బలగ మురళి తదితరులు పాల్గొన్నారు.

సైక్లిస్ట్‌కు గాయాలు

ఎచ్చెర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): తోటపాలెం రోడ్డులో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఓ సైక్లిస్ట్ గాయపడ్డాడు. తోటపాలెం గ్రామానికి చెందిన గొర్లె నాగభూషణరావు శ్రీకాకుళంలో పని ముగించుకుని సైకిల్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ నాగభూషణరావు శ్రీకాకుళం సర్వజనాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎట్టకేలకు తారు పడింది..

● హర్షం వ్యక్తంచేస్తున్న మొజ్జువాడ గ్రామస్థులు



మొజ్జువాడ గ్రామానికి వేసిన బీటీ రోడ్డు

నందిగాం, మే 21(ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ మొజ్జు వాడ గ్రామానికి ఎట్టకేలకు బీటీరోడ్డు నిర్మాణంతో స్థానికుల్లో ఆనందం వెల్లి విరిసింది. 2017-18లో అప్పటి టీడీపీ హయాంలో రోడ్డు మంజూరై మెటల్ ప్రక్రియ పూర్తి చేశారు. అయితే ఆ తరువాత వైసీపీ ఐదేళ్ల కాలంలో పనులకు మోక్షం కలగకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, ఉపాధి హామీ పథకం కింద రూ.1.20 కోట్లతో పాలూరు జంక్షన్ నుంచి కొండపేట జంక్షన్ వయా మొజ్జువాడ వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు చొరవతో రోడ్డు సమస్య పరిష్కారమైందని స్థానికులు పేర్కొంటున్నారు. నిధులు విడుదల చేయించిన మంత్రులకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

దేశాభివృద్ధికి రాజీవ్ విశేష కృషి



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జలుమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధికి దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విశేషంగా కృషి చేశారని, ఆయన ఆశయాలను కొనసాగించాలని నరసన్నపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ అన్నారు. రాజీవ్ గాంధీ వర్థంతి సందర్భం గా బుధవారం చల్లవానిపేటలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తెచ్చిన ఘనత రాజీవ్‌కే దక్కిం దన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అంపోలు మల్లన్న, భేరి వెంకటరమణ, చింతాడ లింగమూర్తి, కృష్ణారావు, బట్న సాయికుమార్ పాల్గొన్నారు.

చినుకు పడితే చెరువే..



పూడిజగన్నాథపురం రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వజ్రపుకొత్తూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): పూడిజగన్నాథపురం రోడ్డు దారుణంగా ఉంది. బుధవారం కురిసిన వర్షానికి నీరు రోడ్డుపై నిలిచి రాక పోకలకు ఇబ్బందులు తలెత్తాయి. గతంలోనూ ఇలాంటి పరిస్థితే ఎదురైందని, రోజుల తరబడి నీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమలు వ్యాప్తిచెంది వ్యాధుల బారిన పడ్డామని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

అదనపు పరిహారం ఏమైంది?

సంతబొమ్మాళి, మే 21(ఆంధ్రజ్యోతి): మూలపేట పోర్టు భూసేకరణకు సంబంధించి రెండోసారి ఎకరాకి రూ.12.50 లక్షల చొప్పున ఇచ్చిన అదనపు పరిహారం తనకు ఇవ్వలేదని బాధిత రైతు జీరు ధర్మా రావు ప్రశ్నించారు. బుధవారం తన కుటుంబ సభ్యులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం హయాంలో పోర్టు నిర్మాణాన్ని తాను వ్యతిరేకించానని, అప్పట్లో తాను సంతకం కూడా చేయ లేదన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక పార్టీ నేతల హామీతో సంతకం చేశానని, అయితే తనకు చెందిన 1.30 ఎకరాలకు సంబంధించి రూ.21.25 లక్షలు ఇచ్చారన్నారు. అయితే ఆ తరువాత 23 మందికి అదనపు పరిహారం ఇచ్చారని, తనకు మాత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించండి

కొత్తూరు, మే 21(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయం చేసే దిశలో రైతులు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయం డివిజినల్ అధికారి సూర్యనారాయణ అన్నారు. బుధవారం వసప గ్రామంలో రైతులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ పంటలపై అవగాహన కల్పించారు. శృతి, చిన్నమ్మడు సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు వేలం వాయిదా

జలుమూరు, మే 21 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వర స్వామికి చెందిన భూముల కౌలు వేలంపాట వాయిదా వేసినట్లు ఆలయ ఈవో పి.ప్రభాకరరావు తెలిపారు. బుధవారం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించేందుకు సిద్ధమైనా రైతులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు తెలిపారు. తదుపరి తేదీని మరలా ప్రకటిస్తామన్నారు.

19 పశువుల పట్టివేత

ఎచ్చెర్ల, మే 21(ఆంధ్రజ్యోతి): నవభారత్ జంక్షన్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం రెండు పశువుల వ్యాన్‌లను ఎచ్చెర్ల పోలీసులు పట్టు కున్నారు. నారాయణపురం సంత నుంచి అలమండ (విజయనగరం) తీసుకెళ్తున్న 19 పశువులను పట్టుకుని రెండు వ్యాన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన ఈ పశువులను కొత్తవలస (విజయనగరం జిల్లా) గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్.సందీప్‌కుమార్ తెలిపారు.

బంగారం షాపులో చోరీ

పలాసరూరల్, మే 21(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ బస్టాండ్ వద్ద ఉన్న ఓ బంగారు షాపులో బుధవారం సినీఫక్కీలో చోరీ జరిగింది. కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. షాపునకు ఒక యువకుడు వచ్చి బంగారం కావాలని కోరగా షాపు యజమాని బంగారం చైన్లు చూపించారు. వాటిని చూస్తున్నట్లు నటించిన ఆ యువకుడు ఒక్కసారిగా మూడు తులాలకు పైగా బరువు కలిగిన చెయిన్‌ను పటుట్టకుని ఉడాయించాడు. షాపు యజమాని బయటకు వచ్చి ఎంత వెతికినా అతడి ఆచూకీ కనిపించక పోవడంతో కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలాస-కాశీబుగ్గ జంక్షన్ల వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా సదరు యువకుడు ఒకచోట షర్టు ధరించి కనిపించగా మరో చోట టీషర్టుతో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సూర్యనారాయణ తెలిపారు.

చార్‌ధామ్ యాత్రకు వెళ్లి వ్యాపారి మృతి



జామి శ్రీధర్ (ఫైల్)

నరసన్నపేట, మే 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీరామనగర్‌కు చెందిన వ్యాపారి జామి శ్రీధర్ (54) గుండెపోటుకు గురై బుధవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజుల కిందట యాత్ర కు స్థానిక వ్యాపారులతో కలిసి వెళ్లినట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య విజయలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. చార్‌ధామ్ యాత్రలో భాగంగా బద్రీనాథ్ కొండలపై వెళుతున్న సమయంలో ఒక్కసారి అస్వస్థతకు గురైనట్లు సమాచారం. తోటి యాత్రికులు పరిశీలించినప్పటికే శ్రీధర్ మృతి చెందినట్లు చెబుతున్నారు.

పట్టర పట్టు హైలెస్సా..!

'శ్రమయేవ జయతే' అనే దానిని నిరూపించారు ఆరుగురు కార్మికులు.. సుమారు 5 టన్నుల బరువు ఉన్న ఓ భారీ మర్రి చెట్టు మొదలును ఏకకాలంలో ఎత్తి తమ శక్తిని చాటారు. ఎక్సకవేటర్‌తో గాని ఎత్తేందుకు వీలులేని మొదలును ఒకేసారి వీరంతా ఎత్తి మానవ శక్తి ముందు ఏదీ అతీతం కాదని మరోసారి నిరూపించారు. ఈ దృశ్యం బుధవారం ఉదయం ఓ కర్రల మిల్లులో 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

-పలాస, ఆంధ్రజ్యోతి



భారీ మర్రి చెట్టు మొదలును ఎత్తుతున్న కార్మికులు